manavishwam.com

మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANAVISHWAM TELUGU DAILY

మనసుల్లో ఓర్వలేనితనం ఉన్నప్పుడు, నువ్వు ఏడు కొండలు ఎక్కినా... ఏడుస్తూ పూజచేసినా ఒక్కటే.!

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 43 | గురువారం, జూలై 30 2026 | పేజీలు - 8 | వెల : 5/-

## నదీ జలాలపై
# కీలక చర్చ

- ఢిల్లీలో తెలంగాణ--కర్ణాటక నేతల భేటీ
- కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌తో సమావేశం
- తుంగభద్ర, కృష్ణా జలాలపై సమాలోచనలు
- అంతర్రాష్ట్ర జల సమస్యల పరిష్కారంపై దృష్టి



**న్యూఢిల్లీ, జూలై 29 (మన విశ్వం):** అంతర్రాష్ట్ర నదీ జలాల అంశాలపై తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య కీలక చర్చలు జరిగాయి. ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌తో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమై ఇరు రాష్ట్రాలకు సంబంధించిన జల అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా తుంగభద్ర, కృష్ణా నదీ జలాల వినియోగం, అంతర్రాష్ట్ర జలాల పంపిణీ, ఇరు రాష్ట్రాల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. జల వనరుల వినియోగంలో పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని నేతలు ప్రస్తావించారు. మిగతా 2లో...



## పేపర్ లీక్‌లపై
# ఉక్కుపాదం!

- యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- 10 ఏళ్ల జైలు.. రూ.50 లక్షల జరిమానా వరకు కఠిన శిక్షలు
- పరీక్షా మాఫియాపై ప్రత్యేక దర్యాప్తు బృందం.. రెండు నెలల్లో విచారణ పూర్తి

**న్యూఢిల్లీ, జూలై 29 (మన విశ్వం):**
దేశవ్యాప్తంగా పరీక్షల్లో జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలకు కట్టడి వేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ (సవరణ) బిల్లుకు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది. బిల్లును ఉభయసభల సంయుక్త కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు చేసిన డిమాండ్లను స్పీకర్ ఓం బిర్లా తిరస్కరించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిచ్చిన కేంద్ర ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్.. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను కాపాడేందుకు, విద్యార్థుల భవిష్యత్తును రక్షించేందుకే చట్టాన్ని మరింత కఠినతరం చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాలకు పాల్పడే వారిపై ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ దేశంలో 152 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయని చేసిన వ్యాఖ్యలకు ఆధారాలు లేవన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటు సంప్రదాయాలకు విరుద్ధమైన పదజాలం ఉపయోగించారని మిగతా 2లో...

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్
# వేగవంతం చేయాలి

- రెండు రోజుల్లో డేటా లోపాల సవరణకు ఆదేశాలు
- బీఎల్‌వో నమోదు వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలి
- సంక్షేమ పథకాలకు ఓటరు జాబితాకు సంబంధం లేదన్న ఎన్నికల అధికారి
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం




**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు మరికొద్ది రోజులే మిగిలి ఉన్న నేపథ్యంలో డేటా నమోదు, లోపాల సవరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఎస్ఐఆర్ పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, డేటా నమోదు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ తదితర అంశాలను సమీక్షించారు. జిల్లాల వారీగా పనుల పురోగతిని తెలుసుకుని పెండింగ్‌లో మిగతా 2లో...

## రెండేళ్లలో హైడ్రా భారీ చర్యలు

- 3,325 ఎకరాల ప్రభుత్వ భూముల పరిరక్షణ
- చెరువులు, పార్కులు, నాలాల ఆక్రమణల తొలగింపు
- రాష్ట్రవ్యాప్తంగా కీలక భూకబ్జాలపై ఉక్కుపాదం
- ప్రజా ఆస్తుల సంరక్షణలో హైడ్రా కీలక చర్యలు

**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం):**
ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు, నాలాలు, ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాల పరిరక్షణలో హైడ్రా రెండేళ్ల కాలంలో భారీ స్థాయిలో చర్యలు చేపట్టింది. ఈ కాలంలో మొత్తం 3,325 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విముక్తి చేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చినట్లు హైడ్రా వెల్లడించింది. ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు, భూకబ్జాలపై కఠిన చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపింది. హైడ్రా వివరాల ప్రకారం ప్రభుత్వ భూముల్లో 2,665 ఎకరాలు, చెరువుల్లో 454.11 ఎకరాలు, పార్కుల్లో 90.39 ఎకరాలు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూముల్లో 26.31 ఎకరాలు, నాలాల్లో 25.37 ఎకరాలు, రహదారులు, ఫుట్‌పాత్‌లలో 62.18 ఎకరాల ఆక్రమణలను తొలగించింది. మిగతా 2లో...

## పోలీస్ నియామకాలకు
# గ్రీన్ సిగ్నల్

- నాలుగు శాఖల్లో 7,437 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు
- ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు.. అర్హత పత్రాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచన

**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం):** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ , ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్, జైళ్ల శాఖల్లో మొత్తం 7,437 ఖాళీల భర్తీకి నాలుగు వేర్వేరు నియామక నోటిఫికేషన్లను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బోర్డు స్పష్టం చేసింది.పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్) 148, రిజర్వ్ ఎస్ఐ (ఏఆర్) 14, మిగతా 2లో...

## ములుగు ఆర్టీఏలో
# అవినీతి గుట్టురట్టు?




**ప్రత్యేక ప్రతినిధి , జూలై 29 (మన విశ్వం):** ములుగు రవాణా శాఖ (ఆర్టీఏ) కార్యాలయంలో అవినీతి, అక్రమ వసూళ్లు బహిరంగ రహస్యంగా మారినట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయానికి ఏ పని కోసం వెళ్లినా ప్రభుత్వ ఫీజుతో పాటు అదనంగా "మామూళ్లు" చెల్లించాల్సిందేనని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సేవకు ప్రత్యేక రేటు నిర్ణయించి, ఓ ప్రైవేట్ వ్యక్తి ద్వారా లంచాల వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి.

- ప్రతి సేవకు 'ఫిక్స్‌డ్ రేటు'లతో వసూళ్ల జోరు!
- ప్రైవేట్ వ్యక్తి ద్వారా కోడ్ భాషలో లంచాల వసూళ్లా?
- 'మన విశ్వం' నిఘా బృందం పరిశీలనలో సంచలన అంశాలు


విశ్వసనీయ సమాచారం ప్రకారం, నూతన వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇతర సేవలకు వేర్వేరుగా మామూళ్ల రేట్లు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కార్యాలయానికి చెందిన కొందరు సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తి కలిసి వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
ఈ వ్యవహారంపై 'మన విశ్వం' నిఘా బృందం గత 15 రోజులుగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి పలు ఆధారాలను సేకరించింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన అధికారిక ఫీజుకు అదనంగా అక్రమంగా నగదు వసూలు చేస్తున్నట్లు, ఆ నగదును మిగతా 2లో...

## చంచల్‌గూడ జైలుకు
# ట్రైనీ ఐపీఎస్



**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం):** తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్‌కృష్ణారెడ్డిని కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపింది. మిగతా 2లో...

# సంపాదకీయం




## పరీక్షల బిల్లుతో సమస్య సమిసిపోయేనా?

పిల్లికి చెలగాటం...ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా మన పరీక్షల విధానం మారింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్షల లీక్‌తో మన పరీక్షల విధానం ఎంత డొల్లగా ఉందో తేలిపోయింది. డబ్బులకు కక్కుర్తి పడే లెక్చరర్లు ఉండడం దౌర్భాగ్యం. విద్యార్థులు ఏమైతేనేమీ మనకు కాసులు రాలుతున్నాయని పేపర్లను లీక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలి నీట్ పేపర్ లీక్‌తో కాక్రోచ్ పార్టీ ఉద్యమించడం, అంతే స్పీడ్‌గా ఇప్పుడు పార్లమెంటులో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో గమనించిన విషయమేమిటంటే విపక్షాలకు కూడా పకడ్బందీ విధానం ఎలా అమలు చేయాలన్న దానిపై అవగాహన లేదని తేలిపోయింది. చర్చలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, గగోయ్, అఖిలేశ్ యాదవ్‌లు విమర్శలు చేశారే తప్పపరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అసవరమైన సూచనలు చేయలేక పోయారు. కాక్రచ్ ఉద్యమాన్ని ముందుకేసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక సూచనలు చేయలేదు. ప్రభుత్వం కూడా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పక్కాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే మంత్రి రాజీనామాతోనే భ్రష్టుపట్టిన మన దేశ విద్యా వ్యవస్థ మారిపోదు. పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకలు, అవినీతి వంటి సమస్యలు తొలగిపోవాటంలే పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ఎందుకంటే పేపర్ లీకేజీలకు మూలం డబ్బుల మాయగా ఉంది. ఈజీగా డబ్బు సంపాదించే క్రమంలో ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. మెడికల్ కాలేజీల ప్రవేశానికి లక్షల మంది రాసే పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చట్టబద్ధతను సమీక్షించాలి. వాస్తవానికి ఎన్టీఏ అనేది ఒక అకడమిక్ బాడీ కూడా కాదని ఎంతమందికి తెలుసు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన సంస్థ అంతకన్నా కాదు. కేవలం కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ మాత్రమే అని ఇక్కడ గుర్తించాలి. దానికంటూ స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఏమీ లేవు. అలాంటి సంస్థకు దేశంలోని నీట్‌తో సహా అనేక ప్రవేశ పరీక్షలను, పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ఈ కారణంగా దేశ విద్యారంగాన్నంతా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకునే అధికారాల కేంద్రీకరణ విధానం. అందువల్లనే పరీక్షలలో అక్రమాలు, అవకతవకలు, అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయి. నీట్ కోచింగ్ సెంటర్స్‌ను నిర్వహిస్తున్న వారే నీట్ పేపర్ సెట్టర్స్‌గా అవతారమెత్తారంటే ఎన్టీఏ కేంద్రంగా కోచింగ్ మాఫియా ఏ స్థాయిలో బలంగా వేళ్లూనుకుందో చెప్పవచ్చు. ఈ విధమైన వేల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారం సాగుతుఓంది. అధికారుల అండదండలు లేకుండా ఇది జరు9గుతందని అనుకోవడానికి లేదు. అందువల్ల ఈ ఎన్‌టిఎ స్థానంలో ప్రస్తుతం బిల్లు ఏ ర కంగా ఉంటుందో తెలియదు. పార్లమెంటులో చర్చ సాగుతున్నా సీరియస్‌నెస్ కానరావడం లేదు. బిల్లులో కేంద్రాన్ని విమర్శించడం తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అయ్యాయి. కావున ఎన్టీఏ ఉనికిని, దాని చుట్టూ బలంగా అల్లుకొని ఉన్న అవినీతి చట్రాన్ని బ్రద్దలు కొట్టాలి. లేదంటే కంటితుడుపు చర్యగా పేపర్ లీకేజీలో దళారి పాత్ర పోషించిన కొద్దిమంది నేరస్తులను బలి ఇవ్వడం, ఎన్టీఏలోని కొద్దిమంది అధికారులను తొలగించడం వంటి కసరత్తుగా మిగిలి పోతుంది. ఇంత ఆగ్రహం, ఆందోళన చెలరేగిన నేపథ్యంలో అసమర్థ ఎన్టీఏను రద్దుచేసి, తిరిగి రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ అడ్మిషన్స్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించాలనే డిమాండ్ ను కూడా పునఃపరిశీలించడం అవసరం. ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, రాజ్యాంగ ఫెడరల్ సూత్రాలను కాలరాస్తున్న విద్యా కేంద్రీకరణ విధానానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. పేపర్ లీకేజి సమస్య అనేది నేడు కొత్తగా తలెత్తినది కాదు. గతంలో కూడా మెడికల్, ఇంజినీరింగ్, వంటి కోర్సులకు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలోనూ అక్రమాలు, అవకతవకలు, లీకేజీలు చోటుచేసుకున్నాయి. చదువులంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కోర్సులు అన్న భావన బలపడి పోయింది. జేఈఈ, నీట్ పరీక్షలలో మంచి ర్యాంకులు పొందడమే మహా యజ్ఞమైంది. మిగతావన్నీ కొరగానివిగా, అర్భకుల చదువులుగా భావించే అపోహ బలపడ్డాయి. ఇదే అదనుగా కోచింగ్ సెంటర్లు పుట్టుకు వచ్చాయి. కోటళ్లల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చేశాయి. ప్రైవేట్ రంగం విజృంభించడానికి ఇలాంటి నీట్ పరీక్షల విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. దీనికితోడు సమాజంలో నిరుద్యోగం, ఉపాధి లేమి అంతకంతకూ పెరుగుతుండడంతో పిల్లల భవిష్యత్తు యెడల అంతులేని అభద్రతాభావం తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఈ పరిస్థితులే కార్పొరేట్ విద్యకు, కోట్ల వ్యాపారానికి, కోచింగ్ సెంటర్ల మాఫియా ముఠాలకు కేంద్రాలుగా మారాయి. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసలుబాట్లను ఉపయోగించుకుంటారు. అందువల్ల సమగ్ర విద్యావిధానంపై చర్చించి, విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలకు నడుంబిగించాలి. కనీసం విపక్షాలయినా ఈ బిల్లు సందర్భంలో ప్రమాణాలపై చర్చివుంటే బాగుంటుంది.

## నదీ జలాలపై

నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన నీటి లభ్యత, భవిష్యత్ కార్యాచరణ, నదీ జలాల సమర్థ వినియోగంపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. ఇరు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరస్పర అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలని చర్చించారు. రైతుల సాగునీటి అవసరాలు, తాగునీటి భద్రత, జల వనరుల పరిరక్షణ వంటి అంశాలపై కూడా



సమావేశంలో సమగ్రంగా చర్చించారు. అంతర్రాష్ట్ర జలాల అంశాల్లో సహకార స్ఫూర్తితో ముందుకు సాగాలని ఇరు రాష్ట్రాల నేతలు అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశం తెలంగాణ--కర్ణాటక రాష్ట్రాల మధ్య జల సంబంధిత అంశాలపై సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలకంగా మారనుంది. తుంగభద్ర, కృష్ణా నదీ జలాల అంశాల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగేందుకు ఇరు రాష్ట్రాలు సిద్ధంగా ఉన్నట్లు సమావేశంలో స్పష్టమైంది.

## పేపర్ లీక్‌లపై

విమర్శించారు. కాల్పుల ఆదేశాలపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ, అలాంటి నిర్ణయం తీసుకునే అధికారం మేజిస్ట్రేట్‌కే ఉంటుందని, అసలు కాల్పులే జరగలేదని, బాష్పవాయువును మాత్రమే ప్రయోగించారని స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి విదేశాల్లో ఉన్నారన్న ప్రచారాన్ని కూడా ఆయన నిరాధారమని కొట్టిపారేశారు.

కఠిన శిక్షలే ప్రధాన ఆయుధం



సవరణ బిల్లు ప్రకారం పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారికి కనీసం ఐదేళ్ల నుంచి గరిష్టంగా పదేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు. ప్రస్తుతం ఉన్న రూ. 10లక్షల జరిమానాను రూ. 50లక్షలకు పెంచే ప్రతిపాదన చేశారు.

పరీక్షల నిర్వహణలో పాల్గొనే సేవల సంస్థలకు విధించే జరిమానాను రూ. 1కోటి నుంచి రూ. 5కోట్లకు పెంచడంతో పాటు, వాటిపై విధించే నిషేధాన్ని నాలుగేళ్ళ నుంచి ఎనిమిదేళ్ల వరకు పొడిగించే నిబంధనను చేర్చారు.

వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాలకు పాల్పడిన సంస్థల డైరెక్టర్లు, ఉన్నతాధికారులకు కనీసం ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 5కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం కల్పించారు. భారీ స్థాయిలో జరిగే పరీక్షా మోసాల విషయంలో కనీస శిక్షను ఏడేళ్లకు, కనీస జరిమానాను రూ. 10కోట్లకు పెంచే ప్రతిపాదన కూడా బిల్లులో ఉంది.

ప్రత్యేక దర్యాప్తు బృందం

పరీక్షా అక్రమాలపై వేగంగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని బిల్లులో పేర్కొన్నారు. కేసుల విచారణను రెండు నెలల్లోపు పూర్తి చేసేలా నిబంధనలు చేర్చారు. దీంతో పేపర్ లీక్ మాఫియాపై వేగవంతమైన దర్యాప్తు, త్వరితగతిన శిక్షలు అమలయ్యే అవకాశం ఏర్పడనుంది.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్

ఉన్న ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

బీఎల్‌వోలు నమోదు చేసిన ఓటర్ల వివరాల్లో పలు పొరపాట్లు గుర్తించినట్లు సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ కారణంగా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతున్నాయన్న ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల బీఎల్‌వోలు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా క్రాస్ వెరిఫై చేయాలని ఆదేశించారు. యాదృచ్ఛికంగా ఓటర్ల వివరాలను పరిశీలించి అన్ని డేటా లోపాలను మరో రెండు రోజుల్లోగా సరిదిద్దాలని, అనంతరం తప్పిదాలు గుర్తిస్తే సంబంధిత బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నందున రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని




సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో వంద శాతం డిజిటలైజేషన్ పూర్తికాగా, 80 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఖండించాలని, రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తూ పురోగతిని వివరించాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను బూత్ లెవల్ ఏజెంట్లకు అందజేసి వారి సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు.

## ములుగు ఆర్టీఏలో

నేరుగా కాకుండా కోడ్ భాషలో ప్రైవేట్ వ్యక్తి ద్వారా సేకరిస్తున్నట్లు సమాచారం లభించింది. వాహనదారులు తమ పనులు త్వరగా పూర్తవ్వాలంటే మామూళ్లు తప్పవని, లేనిపక్షంలో ఫైళ్లను పెండింగ్‌లో ఉంచుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కార్యాలయంలో జరుగుతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ములుగు ఆర్టీఏ కార్యాలయంలో అసలు ఏం జరుగుతోంది?

ఏ సేవకు ఎంత మొత్తం వసూలు చేస్తున్నారు?

ప్రభుత్వ ఫీజు ఎంత? అక్రమ మామూళ్లు ఎంత?

వసూళ్లు చేస్తున్నది ఎవరు? వాటిని ప్రోత్సహిస్తున్నది ఎవరు?

ప్రైవేట్ వ్యక్తి పాత్ర ఏమిటి?

ఆధారాలతో బయటపడనున్న అక్రమాల అసలు చిత్రమేమిటి?

ప్రభుత్వ రుసుములు -- అక్రమ వసూళ్ల తేడా, బాధితుల వాంగ్మూలాలు, సేకరించిన ఆధారాలతో కూడిన సంచలన కథనాన్ని 'మన విశ్వం' ప్రచురించునుంది

## చంచల్‌గూడ జైలుకు

ఉప్పరపల్లి కోర్టు ఆదేశాల మేరకు ఆయనను కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. రిమాండ్ ఆగస్టు 11 వరకు అమల్లో ఉండనుంది.

ఈ కేసులో అరెస్టు చేసిన ఉదయ్‌కృష్ణారెడ్డిని పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలు, దర్యాప్తు పురోగతిని కోర్టు దృష్టికి తీసుకెళ్లిన దర్యాప్తు అధికారులు, నిందితుడిని రిమాండ్‌కు పంపాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రాజేంద్రనగర్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న సమయంలో కర్ణాటక కేడర్‌కు చెందిన మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిని ఉదయ్‌కృష్ణారెడ్డి వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పలుమార్లు అభ్యంతరకరంగా ప్రవర్తించడంతో పాటు శారీరకంగా దాడి చేసినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్లతో పాటు సమాచార సాంకేతిక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దర్యాప్తులో భాగంగా సేకరించిన ప్రాథమిక ఆధారాల ప్రకారం బాధితురాలిపై మానసిక ఒత్తిడి తీసుకొచ్చేందుకు, వ్యక్తిగత వీడియోలను ఉపయోగించి బెదిరింపులకు పాల్పడినట్లు కూడా అభియోగాలు నమోదయ్యాయి. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత నిందితుడు కనిపించకుండా పోవడం, అనంతరం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారనే సమాచారం బయటకు రావడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ఇదిలా ఉండగా, అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉదయ్‌కృష్ణారెడ్డిని పోలీసులు జూలై 28న మిర్యాలగూడ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వైద్యుల అనుమతి అనంతరం ఆయనను అధికారికంగా అరెస్టు చేసి, వైద్య పరీక్షలు పూర్తి చేసిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ఈ కేసులో డిజిటల్ ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలను సేకరిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## రెండేళ్లలో హైడ్రా భారీ చర్యలు

ప్రజా ఆస్తుల రక్షణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొంది.సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో 816 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా పరిరక్షించింది. అక్రమంగా ఆక్రమించిన 40 ఎకరాలను స్వాధీనం చేసుకుని భవిష్యత్తులో కబ్జాలకు అవకాశం లేకుండా మొత్తం ప్రాంతానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చెందిన సుమారు 300 ఎకరాల భూమిని కూడా ఆక్రమణల నుంచి కాపాడింది. ఈ ప్రాంతంలో అంతర్రాష్ట్ర బస్ టెర్మినల్‌తో పాటు ఇతర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో 40 ఎకరాల యూఎల్‌సీ భూమిని స్వాధీనం చేసుకున్న హైడ్రా, అందులో 10 ఎకరాల్లో సమీకృత ప్రభుత్వ పాఠశాల, కళాశాలలు, వసతి గృహాల నిర్మాణానికి మార్గం సుగమం చేసింది. పీర్జాదిగూడలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని చుట్టుముట్టిన అక్రమ ప్రహరీలను తొలగించి కాలనీలకు రాకపోకలు పునరుద్ధరించింది. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అక్రమ నిర్మాణాలను ఎక్కడా ఉపేక్షించబోమని స్పష్టం చేసింది.సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో 106 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది. అక్రమ లేఅవుట్లు, ప్రహరీలను తొలగించి మొత్తం ప్రాంతానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. కొండలను పేల్చడం, పర్యావరణానికి నష్టం కలిగించడం, వన్యప్రాణుల ఆవాసాలను దెబ్బతీసిన ఘటనలపై స్థానికుల ఫిర్యాదుల మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. హైడ్రా చర్యలకు స్థానిక ప్రజలు మద్దతు తెలుపుతూ సంబరాలు నిర్వహించినట్లు వెల్లడించింది. ఇక రంగారెడ్డి జిల్లా బహదూర్‌గూడలో 650 ఎకరాల ప్రభుత్వ భూమిని, రాయదుర్గంలో మరో 84 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి రక్షించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు హైడ్రా పేర్కొంది. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తుల పరిరక్షణకు భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో చర్యలు కొనసాగిస్తామని, భూకబ్జాలపై రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

## పోలీస్ నియామకాలకు ?

రిజర్వ్ ఎస్ఐ (టీజీఎస్‌పీ) 12, రిజర్వ్ ఎస్ఐ (ఎస్ఏఆర్‌సీపీఎల్) 3, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎఫ్‌పీబీ) 23 పోస్టులు భర్తీ చేయనున్నారు.కానిస్టేబుల్ నియామకాలలో సివిల్ 3,697, ఏఆర్ 1,052, ఎస్ఏఆర్‌సీపీఎల్ 24, డ్రైవర్ (పీటీవో) 20, మెకానిక్ (పీటీవో) 7 పోస్టులు ఉన్నాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో 44 సబ్ ఇన్‌స్పెక్టర్లు, 1,380 కానిస్టేబుళ్లు నియమించనున్నారు. ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ సివిల్ డిఫెన్స్ శాఖలో 39 స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 751 ఫైర్ ఫైటర్లు ఎంపిక చేయనుండగా, జైళ్ల శాఖలో 14 పురుష డిప్యూటీ జైలర్లు, ఒక మహిళా డిప్యూటీ జైలర్, 196 పురుష వార్డర్లు, 12 మహిళా వార్డర్ల పోస్టులు భర్తీ చేయనున్నారు. దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో మాత్రమే స్వీకరించనున్నట్లు బోర్డు తెలిపింది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందు నోటిఫికేషన్‌లో పేర్కొన్న శారీరక, వైద్య ప్రమాణాలకు తాము అర్హులా కాదా అనే విషయాన్ని సివిల్ సర్జన్ ద్వారా పరీక్షించుకోవాలని సూచించింది. అలాగే తెలంగాణ స్థానికతకు సంబంధించిన 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు బోనాఫైడ్ ధ్రువపత్రాలు లేదా నివాస ధ్రువీకరణ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొంది. 2026 ఏప్రిల్ 1 తర్వాత జారీ చేసిన బీసీ నాన్-క్రీమీలేయర్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం, అలాగే ఎస్సీ అభ్యర్థులు ఉపకుల వర్గీకరణ స్పష్టంగా ఉన్న కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ వెల్లడించారు. ఈ నియామకాలకు సంబంధించిన పూర్తి అర్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం, పరీక్షల షెడ్యూల్ తదితర వివరాలు అధికారిక నోటిఫికేషన్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

# యాదాద్రి ఆలయంలో సీఎస్ ప్రమాణ స్వీకారం

- లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న సంజయ్ జాజు
- ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా బాధ్యతల స్వీకారం

**యాదాద్రి, జూలై 29 (మన విశ్వం):** తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం యాదాద్రి శ్రీలక్ష్మీనంసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదాద్రి దేవస్థానం ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధానాలయంలోని బంగారు వాకిలి వద్ద అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి భవాని శంకర్ సంజయ్ జాజుతో ప్రమాణ స్వీకారం చేయించి ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా బాధ్యతలు స్వీకరింపజేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.ప్రమాణ స్వీకారం అనంతరం సంజయ్ జాజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర



ప్రజల సుఖసంతోషాలు, అభివృద్ధి కోసం ప్రార్ధనలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. యాదాద్రి దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పనలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై సమన్వయంతో ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు.యాదాద్రి ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో దేవస్థానం పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై కూడా అధికారులతో చర్చ జరిగినట్లు సమాచారం. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. సంజయ్ జాజుకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు కల్పించారు.

# అవయవదానంతో అమరత్వం

- బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవదానం
- ఐదుగురికి కొత్త జీవితాన్ని అందించిన కుటుంబం
- తండ్రి గొప్ప నిర్ణయానికి ప్రశంసలు
- అవయవదానంపై అవగాహన పెంచాలని పిలుపు



**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం ):** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన 25 ఏళ్ల పెంద్ర మనోజ్ కుమార్ అవయవదానం ద్వారా ఐదుగురికి కొత్త జీవితాన్ని అందించారు. కుమారుడిని కోల్పోయిన తీవ్ర విషాదంలోనూ ఆయన తండ్రి శ్రీనివాస్ తీసుకున్న మానవతా నిర్ణయం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. వైద్యులు మనోజ్ కుమార్ బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించిన అనంతరం, ఆయన తండ్రి శ్రీనివాస్ తన కుమారుడి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఈ నిర్ణయంతో ఐదుగురు అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న రోగులకు కొత్త ఆశ లభించింది. కుటుంబం తీసుకున్న ఈ నిర్ణయం మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది.
కొడుకును కోల్పోయిన బాధ ఏ తల్లిదండ్రులకైనా తీరనిదే. అయినప్పటికీ, ఆ బాధను పక్కనపెట్టి మరొకరి ప్రాణాలను కాపాడాలనే గొప్ప సంకల్పంతో ముందుకొచ్చిన శ్రీనివాస్ నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని వైద్యులు, సామాజిక వర్గాలు అభినందిస్తున్నాయి. అవయవదానం ద్వారా మరణ నింవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండె, కాలేయం, మూత్రపిండాలు, కళ్లతో పాటు ఇతర అవయవాల దానం ద్వారా అనేక మందికి పునర్జన్మ లభించే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. అవయవదానం ఒక మహోన్నతమైన మానవతా సేవగా అభివర్ణిస్తున్నారు.
రాష్ట్రంలో అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్నప్పటికీ, ఇంకా మరింత మంది ముందుకు రావాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను సమయానికి దానం చేస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యుల్లో కూడా అవగాహన పెరగాలని కోరుతున్నారు. పెంద్ర మనోజ్ కుమార్ కుటుంబం తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. మరణం జీవితానికి ముగింపు అయినప్పటికీ, అవయవదానం ద్వారా మరొకరి జీవితంలో కొత్త ఆశలు నింపవచ్చని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. ప్రతి ఒక్కరూ అవయవదానంపై సానుకూల దృక్పథంతో ముందుకు వచ్చి ప్రాణాపాయంలో ఉన్నవారికి జీవనదాతలుగా మారాలని వైద్యులు పిలుపునిస్తున్నారు.

# ఉగ్రరూపంలో బొగత జలపాతం

- భారీ వర్షాలతో పెరిగిన వరద ఉధృతి
- పర్యాటకుల ప్రవేశంపై తాత్కాలిక నిషేధం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక
- భద్రతా చర్యలు ముమ్మరం

**ములుగు, జూలై 29 (మన విశ్వం ):** వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ ఉత్తర జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ములుగు జిల్లా వాజేడు మండలంలోని ప్రసిద్ధ బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చింది. ఎగువ అటవీ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. గత పది గంటలుగా అటవీ ప్రాంతంలో కురుస్తున్న నిరంతర వర్షాలతో జలపాతంలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. భారీ వరద ప్రవాహంతో జలపాతం పరిసర ప్రాంతాలు ప్రమాదకరంగా మారడంతో పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతం సందర్శనను అటవీ శాఖ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పర్యాటకులను అనుమతించబోమని స్పష్టం చేశారు. వరద ఉధృతి కారణంగా రాళ్లు జారిపడే ప్రమాదం ఉండటంతో పాటు నీటి ప్రవాహం అకస్మాత్తుగా మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఎవరూ జలపాతం వద్దకు వెళ్లే ప్రయత్నం చేయవద్దని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.అవాంఛనీయ ఘటనలు జరగకుండా జలపాతం పరిసర ప్రాంతాల్లో పోలీసులు, అటవీ శాఖ అధికారులు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరద ఉధృతి తగ్గి పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత మాత్రమే పర్యాటకులను అనుమతించే అంశంపై నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. అప్పటి వరకు ప్రజలు, పర్యాటకులు అధికారుల సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆశ్రమ పాఠశాలకు శుభారంభం



- రూ.4.85 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర పెట్టుబడన్న మంత్రి
- నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి 'ఉద్దీపకం-3' పుస్తకావిష్కరణ

**ఖమ్మం, జూలై 29 (మన విశ్వం):** విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టే ప్రతి రూపాయే రాష్ట్రానికి అసలైన పెట్టుబడని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.4.85 కోట్ల వ్యయంతో చేపట్ట న్న పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి విద్యా రంగ అభివృద్ధిపై ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా నాణ్యమైన విద్య, అత్యుత్తమ వసతులు కల్పించేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమ విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో అదనపు వసతి గృహం, భోజనశాల, ఆధునిక వంటగది, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల సముదాయం, సౌర విద్యుత్ కంచె, ఓవర్ హెడ్ ట్యాంక్ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులు పూర్తయితే విద్యార్థినులకు సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని మంత్రి సూచించారు.
పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు మధ్యలో ఆగకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. విద్య మాత్రమే వ్యక్తి జీవితాన్ని, సమాజాన్ని మార్చగల శక్తిగా నిలుస్తుందని పేర్కొంటూ, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తమ సొంత పిల్లల్లా భావించి నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను బోధించాలని సూచించారు.
ఈ సందర్భంగా ఐటీడీఏ రూపొందించిన 'ఉద్దీపకం--3' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. విద్యార్థులు చదువు పూర్తిచేసిన అనంతరం ఉపాధి అవకాశాల దిశగా మార్గనిర్దేశం చేసేందుకు 'వారధి' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం మంత్రి పాఠ శాల విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ భూక్యా శ్రీనివాస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆశ్రమ పాఠశాలల అభివృద్ధితో ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఖమ్మం పర్యటనకు మనోజ్ సిన్హా

- లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఘన స్వాగతం
- జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష
- సంక్షేమం, పారిశ్రామిక ప్రగతిపై కలెక్టర్ వివరణ
- పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు ప్రయాణం

**ఖమ్మం, జూలై 29 (మన విశ్వం):** జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఎన్ఎస్‌పీ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా యంత్రాంగం తరఫున స్వాగతం తెలియజేశారు. ఎన్ఎస్‌పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్



పారస్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తదనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన మనోజ్ సిన్హాకు కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ రంగం, పారిశ్రామికాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలను వివరించారు.
జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి కూడా కలెక్టర్ సమగ్ర నివేదిక సమర్పించారు. అన్ని శాఖల సమన్వయంతో జిల్లా అభివృద్ధిని వేగవంతం చేస్తున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్‌కు వివరించారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై మనోజ్ సిన్హా అధికారులతో చర్చించి పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమర్ధవంతమైన పరిపాలన కొనసాగించాలని అధికారులకు సూచించినట్లు అధికారులు తెలిపారు. ఖమ్మం పర్యటనలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, జిల్లా ప్రజల ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాల కోసం హైదరాబాద్‌కు బయలుదేరారు.

# నాలుగు పారిశ్రామిక పార్కులకు ప్రతిపాదనలు

- భవ్య పథకంలో కేంద్రానికి నివేదిక
- 500 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పార్కుల ఏర్పాటు
- ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలకు ప్రాధాన్యం
- మరో 16 పార్కుల ఏర్పాటుకు కార్యాచరణ

**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం ):** భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) పథకం కింద తెలంగాణలో నాలుగు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు అధికారులతో పురోగతిని సమీక్షించారు. భవ్య పథకం తొలి దశలో ఏర్పాటు చేయనున్న నాలుగు పారిశ్రామిక పార్కులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఈ నెలాఖరులోగా కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని సంజయ్ జాజు తెలిపారు. ఈ పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణతో పాటు ఇతర ప్రాథమిక ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర అనుమతులు లభించిన వెంటనే అభివృద్ధి పనులను వేగవంతం



చేయనున్నట్లు చెప్పారు.
ప్రతిపాదిత పారిశ్రామిక పార్కులు కందుకూరు మండలం తిమ్మాపూర్, ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు, ఘట్‌కేసర్ మండలం మాదారం, చౌటుప్పల్ మండలం దండు మైలారం ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఒక్కో పార్కు 500 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు అనువైన మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్, ఇతర ఆధునిక తయారీ రంగాలకు చెందిన పలు ప్రముఖ సంస్థలు ఈ పార్కుల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని ప్రధాన కార్యదర్శి తెలిపారు. పరిశ్రమల స్థాపన ద్వారా భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ నాలుగు పార్కులతో పాటు రాష్ట్రంలోని మరో 16 ప్రాంతాల్లో కొత్త పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సంజయ్ జాజు వెల్లడించారు. ప్రాంతీయ సమతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా ఈ ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చేనేత, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సిక్తా పట్నాయక్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భవ్య పథకం ద్వారా తెలంగాణను పారిశ్రామిక రంగంలో మరింత ముందంజలో నిలిపే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి అధికారులకు సూచించారు.

# పసుపు తెలుపు రంగులోనూ ఉంటుందని మీకు తెలుసా.. దాంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?

తెల్ల పసుపు (వైట్ టర్మరిక్) లేదా జెడోయరీ భారతీయులకు పెద్దగా పరిచయం లేని అరుదైన సుగంధ ద్రవ్యం. మన దేశంలో ఎక్కువగా పసుపు రంగు పసుపును పండిస్తారు. అందువల్ల తెల్ల పసుపు చాలా తక్కువగా కనిపిస్తుంది. ఇది అల్లంలా కనిపించినప్పటికీ, ప్రత్యేకమైన ఔషధ గుణాలు కలిగిన దుంప. శాస్త్రీయంగా దీనిని కుర్కుమా జెడోయారియా (జబతీఎబఖ్మ ఓవసశ్మీతీఱ్మ) అని పిలుస్తారు. కొన్ని భారతీయ భాషల్లో దీనిని అంబా పసుపు అని కూడా అంటారు. మామిడి, పసుపు కలిసినట్లుగా ఉండే సువాసన దీని ప్రత్యేకత. తెల్ల పసుపు బయటకు గోధుమరంగు తొక్కతో, లోపల నారింజ లేదా లేత పసుపు రంగులో గట్టి దుంపలా ఉంటుంది. అల్లంలా కనిపించినప్పటికీ, ఇది పసుపు కుటుంబానికి చెందిన మొక్క. సాధారణంగా పొడి రూపంలో,



ఎండబెట్టిన ముక్కలుగా లేదా తాజాగా మార్కెట్‌లో లభిస్తుంది. భారతీయ వంటల్లో తెల్ల పసుపును తాజాగా వాడటమే కాకుండా ఊరగాయల తయారీలో కూడా ఉపయోగిస్తారు. ఇండోనేషియా వంటి దేశాల్లో దీనిని ఎండబెట్టి కరివేపాకు పొడులు, ముఖ్యంగా సముద్ర ఆహార కూరల్లో మసాలాగా ఉపయోగిస్తారు.యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు..తెల్ల పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ (వాపులను తగ్గించే), యాంటీ మైక్రోబియల్ (సూక్ష్మక్రిములను నిరోధించే) గుణాలు ఉంటాయి. అందువల్ల జీర్ణకోశం, శ్వాసకోశానికి సంబంధించిన కొన్ని సమస్యలను తగ్గించడంలో ఇది సహాయపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణక్రియ సరిగా లేకపోవడం, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో తెల్ల పసుపు ఉపయోగపడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో ఇది సహాయకారిగా ఉంటుంది. తెల్ల పసుపులో ఉండే వాపు నిరోధక గుణాలు కీళ్ల వాపు, ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడేవారికి కొంత ఉపశమనం కలిగిస్తాయి. అలాగే చిన్న గాయాలు, కొన్ని చర్మ సమస్యల నుంచి కోలుకోవడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే కుర్కుమెనోల్ (జబతీఎబఎవఅశీశ్రీ) అనే సమ్మేళనం నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.
యాంటీ ఆక్సిడెంట్లు అధికం..ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో ఉండే కుర్కుమిన్ వంటి సమ్మేళనాలు అలెర్జీ ప్రతిచర్యలను ప్రేరేపించే కొన్ని రసాయనాల విడుదలను తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి.

# పులుల సంరక్షణకు సమిష్టి బాధ్యత




- అంతర్జాతీయ పులుల దినోత్సవంలో మంత్రి కొండా సురేఖ పిలుపు
- పులుల పరిరక్షణే ప్రకృతి పరిరక్షణ అన్న మంత్రి సురేఖ
- తెలంగాణలో పులుల సంఖ్య పెంపునకు చర్యలు
- విశిష్ట సేవలందించిన అటవీ సిబ్బందికి సత్కారం

హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం): పులుల సంరక్షణ పట్ల సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల నివాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి ఆవాసమని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులుల ఫోటో ప్రదర్శనను పరిశీలించి, పులుల సంరక్షణపై రూపొందించిన లఘు చిత్రాన్ని వీక్షించారు. సభలో మాట్లాడిన మంత్రి, ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. పులుల సంరక్షణపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. పులి అడవుల ఆరోగ్యానికి ప్రతీక అని, పులులను కాపాడడం అంటే అడవులు, జీవవైవిధ్యం, పర్యావరణం, భావితరాల భవిష్యత్తును కాపాడినట్లేనని పేర్కొన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా కారణంగా పులుల సంఖ్య ఒక దశలో తీవ్రంగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.పులుల పరిరక్షణ కోసం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1973లో ప్రాజెక్ట్ టైగర్‌ను ప్రారంభించడం ద్వారా దేశంలో పులుల సంరక్షణకు బలమైన పునాది పడిందని మంత్రి తెలిపారు. ఈ చర్యల ఫలితంగానే ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం భారతదేశంలోనే ఉన్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 58 పులుల అభయారణ్యాలు విజయవంతంగా పనిచేస్తున్నాయని, ప్రపంచవ్యాప్తంగా పులుల సంరక్షణలో భారత్ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా పులుల సంరక్షణలో ప్రత్యేక గుర్తింపు పొందిందని మంత్రి వెల్లడించారు. అమ్రాబాద్, కవ్వాల్ పులుల అభయారణ్యాలు దేశంలోనే ప్రముఖమైనవిగా గుర్తింపు పొందాయని చెప్పారు. అమ్రాబాద్‌లో నీటి వనరుల అభివృద్ధి, ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల కారణంగా పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. కవ్వాల్ పులుల అభయారణ్యంలో పులుల పునరావాస కార్యక్రమాన్ని చేపట్టి, మహారాష్ట్రలోని తడోబా అభయారణ్యంతో అనుసంధానం చేయడం ద్వారా సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు.ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు అటవీ శాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అడవులను కాపాడడం, వన్యప్రాణులను సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన శిక్షణార్థులను ఉద్దేశించి అటవీ సంపద పరిరక్షణలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో విశేష సేవలందించిన అటవీ శాఖ ఉద్యోగులకు మంత్రి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు కూడా ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కంగనా క్షమాపణ చెప్పాలి

- జెన్ జీ యువత, మహిళలపై వ్యాఖ్యలపై సీపీఐ ఆగ్రహం
- బాధితులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని నారాయణ డిమాండ్
- ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన
- సుప్రీంకోర్టు వైఖరిని ప్రశంసించిన సీపీఐ నేత



హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం): జెన్ జీ యువత, మహిళలను ఉద్దేశించి ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు అవమానకరంగా, అభ్యంతరకరంగా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. నారాయణ విమర్శించారు. తన వ్యాఖ్యలతో సమాజంలో పలువురి మనోభావాలను దెబ్బతీసిన కంగనా రనౌత్ బాధితులైన యువతకు, మహిళలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు, ముఖ్యంగా ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే సమయంలో సంయమనం, బాధ్యతతో వ్యవహరించాలని నారాయణ సూచించారు. సమాజంలో విభేదాలు సృష్టించేలా, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ప్రజా వేదికలపై మాట్లాడే ప్రతి మాట సమాజంపై ప్రభావం చూపుతుందని గుర్తుంచుకోవాలని సూచించారు.
జెన్ జీ యువత, మహిళలపై చేసిన వ్యాఖ్యలు అనేక మందిలో ఆవేదన కలిగించాయని నారాయణ అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారు సమాజంలోని అన్ని వర్గాల భావోద్వేగాలను గౌరవిస్తూ వ్యవహరించాలని, వివాదాస్పద వ్యాఖ్యలతో సామాజిక విభేదాలను పెంచకూడదని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా గతంలో నిరసనకారులను ఉద్దేశించి చేసిన "బొద్దింకలు" వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందించిన తీరును నారాయణ ప్రస్తావించారు. ఆ వ్యాఖ్యల వల్ల కలిగిన భావోద్వేగ బాధను గుర్తించి సరిదిద్దుకునే ప్రయత్నాన్ని స్వాగతించడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు.తప్పును గుర్తించి దిద్దుకునే వైఖరి న్యాయ వ్యవస్థ గొప్పతనాన్ని, ఉన్నతమైన సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని నారాయణ అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు తమ మాటల ప్రభావాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. కంగనా రనౌత్ తన వ్యాఖ్యలపై పునరాలోచించి, వాటి వల్ల మనస్తాపానికి గురైన యువత, మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నారాయణ పునరుద్ఘాటించారు. సమాజంలో పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు బాధ్యతాయుతమైన వ్యవహారశైలి అవసరమని ఆయన పేర్కొన్నారు.

# రాహుల్ క్షమాపణ చెప్పాలి

- పార్లమెంట్ వ్యాఖ్యలపై రాంచందర్‌రావు విమర్శలు "ఇడియట్" పదంపై అభ్యంతరం
- విద్యార్థుల పట్ల కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టిన బీజేపీ
- తెలంగాణ ఉద్యమాలను ప్రస్తావించిన రాష్ట్ర అధ్యక్షుడు



హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం ): పార్లమెంట్‌లో ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఉపయోగించిన "ఇడియట్" అనే పదం పార్లమెంటరీ మరాదలకు విరుద్ధమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. ఆ వ్యాఖ్యలపై దేశ ప్రజలకు రాహుల్ గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న వైఖరికి ఈ వ్యాఖ్యలే నిదర్శనమని రాంచందర్‌రావు అన్నారు. విద్యార్థి ఉద్యమాలను అవమానించడం, అణచివేయడం, నిర్దాక్షిణ్యంగా అణిచివేయడం కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచే అలవాటుగా మారిందని ఆరోపించారు. విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని విమర్శించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన 369 మంది విద్యార్థులు కాంగ్రెస్ పాలనలో జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారని రాంచందర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆ సంఘటనలు మరువలేనివని ఆయన అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ జాప్యం, రాజకీయ నిర్ణయాల కారణంగా సుమారు 1,200 మంది యువకులు, విద్యార్థులు ప్రాణత్యాగం చేశారని రాంచందర్‌రావు ఆరోపించారు. విద్యార్థుల ఆకాంక్షలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని, ఉద్యమాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలు, వారి ఆకాంక్షల పట్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో వ్యవహరించలేదని రాంచందర్‌రావు అన్నారు. విద్యార్థుల ఉద్యమాలను అణచివేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని, ఇప్పుడు కూడా అదే ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు.రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై ప్రజలకు వివరణ ఇవ్వడంతో పాటు క్షమాపణ చెప్పాలని రాంచందర్‌రావు పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య విలువలు, పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రతి ప్రజాప్రతినిధి గౌరవించాలని, ప్రజా జీవితంలో బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించడం అవసరమని ఆయన పేర్కొన్నారు.


# బోనాల ట్రాఫిక్ ఏర్పాట్ల సమీక్ష

- ఉజ్జయిని మహంకాళి జాతరకు పోలీసుల ప్రత్యేక దృష్టి
- ఊరేగింపు మార్గంలో క్షేత్రస్థాయి తనిఖీ
- ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్‌పై చర్చ
- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం): రానున్న శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లను హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సమీక్షించారు. ట్రాఫిక్-1 డిప్యూటీ పోలీస్ కమిషనర్ అవినాష్ కుమార్ క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించి ఊరేగింపు మార్గంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ బాటా చౌరస్తాతో పాటు మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లను పరిశీలించారు. జాతర సమయంలో భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తనిఖీ సందర్భంగా మల్కాజిగిరి జోన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ శ్రీధర్, మల్కాజిగిరి ట్రాఫిక్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ కే. రాహుల్ రెడ్డితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యామ్నాయ మార్గాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, వివిధ జోన్ల మధ్య సమన్వయంపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. బోనాల జాతర సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రకటించే ట్రాఫిక్ మళ్లింపుల మేరకు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపి ట్రాఫిక్ సిబ్బందికి సహకరించాలని కోరారు.
బోనాల జాతరను సజావుగా నిర్వహించేందుకు హైదరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ల మధ్య సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని వెల్లడించారు.

# వర్షంలోనూ విధి నిర్వహణ..డీజీపీ ప్రశంసలు




- భారీ వర్షంలో ట్రాఫిక్‌ను నియంత్రించిన కానిస్టేబుల్‌కు అభినందనలు
- ప్రజల భద్రతే తెలంగాణ పోలీసుల ప్రధాన ధ్యేయమన్న డీజీపి

హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం ): హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాల మధ్య కూడా విధి నిర్వహణలో ఏమాత్రం వెనుకడుగు వేయకుండా ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రజల భద్రత కోసం సేవలందించిన ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను తెలంగాణ పోలీసు శాఖ డీజీపీ సీవీ ఆనంద్ అభినందించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ విధి నిర్వహణలో అంకితభావాన్ని ప్రదర్శించిన పోలీసు సిబ్బంది సేవా స్ఫూర్తిని కొనియాడుతూ సామాజిక మాధ్యమ వేదికగా ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు. సీవీ ఆనంద్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భారీ వర్షం కురుస్తున్న సమయంలో విధి నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వర్షాన్ని లెక్కచేయకుండా తన విధి స్థలంలోనే నిలిచి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ ప్రయాణికుల భద్రతను కాపాడేందుకు కృషి చేశారు. వర్షం కారణంగా ఏర్పడే ట్రాఫిక్ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ విధి నిర్వహించిన ఆయన సేవలను తెలంగాణ పోలీసు శాఖ ప్రత్యేకంగా ప్రశంసించింది.
ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ వర్షమైనా, ఎండైనా, ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తెలంగాణ పోలీసులు ప్రజలకు సేవ చేయడంలో ఎప్పుడూ వెనుకాడరని పేర్కొన్నారు. ప్రజల భద్రత, రహదారి క్రమశిక్షణ, అత్యవసర సేవల నిర్వహణలో ప్రతి పోలీసు సిబ్బంది నిబద్ధతతో పనిచేస్తున్నారని తెలిపారు. పోలీసు శాఖ సేవా స్ఫూర్తికి ఇటువంటి సంఘటనలు నిదర్శనమని అన్నారు. వర్షాకాలంలో ట్రాఫిక్ నిర్వహణ మరింత సవాలుగా మారుతుందని అధికారులు పేర్కొన్నారు. నీరు నిలిచిపోయిన రహదారులు, దృశ్యమానత తగ్గడం, వాహనాల రద్దీ పెరగడం వంటి పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తూ ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.
ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను సజావుగా కొనసాగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కర్తవ్యనిష్ఠ, సేవాభావం, ప్రజల పట్ల బాధ్యతతో పనిచేస్తున్న ప్రతి పోలీసు సిబ్బంది శాఖకు గర్వకారణమని డీజీపీ పేర్కొన్నారు. భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో వాహనదారులు అవసరమైతేనే ప్రయాణాలు చేయాలని, రహదారులపై జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజల రక్షణ కోసం తెలంగాణ పోలీసు శాఖ అన్ని వేళలా అప్రమత్తంగా ఉంటుందని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా విధి నిర్వహణలో రాజీ ఉండదని స్పష్టం చేసింది.

# ఖమ్మంలో అభివృద్ధికి శ్రీకారం

- రూ.7.21 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ
- రైతులకు రూ.21 వేల కోట్ల రుణభారం తగ్గిందన్న మంత్రి
- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ఖమ్మం, జూలై 29 (మన విశ్వం): ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రూ.7.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. డాక్యా తండాలో రూ.1.41 కోట్లతో మంగళగూడెం--డాక్యా తండా రహదారి, పల్లెగూడెంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్ఎస్పీ మీదుగా పల్లెగూడెం వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9,200 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి 25 లక్షల మంది రైతులపై రూ.21 వేల కోట్ల రుణభారాన్ని తగ్గించామని చెప్పారు. సన్న వరిధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నట్లు వివరించారు. నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లతో కలిపి ఇప్పటికే మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. మిగిలిన గ్రామాలకు త్వరలోనే రెండో విడత ఇళ్లు మంజూరు చేసి, మూడో, నాలుగో విడతల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.
రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గ్రామీణ రహదారులు, తాగునీరు, విద్యాసంస్థలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ భూక్యా శ్రీనివాస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాల పురోగతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# గ్రామాభివృద్ధిపై మంత్రి సమీక్ష

- హుస్నాబాద్‌లో మండల స్థాయి సమావేశం
- పంచాయతీల అభివృద్ధిపై అధికారులకు దిశానిర్దేశం
- వర్షాభావ పరిస్థితులకు ముందస్తు చర్యలు
- ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలన్న మంత్రి పొన్నం ప్రభాకర్




**హుస్నాబాద్, జూలై 29 (మన విశ్వం ):** హుస్నాబాద్ మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులతో మంత్రి చర్చించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి సరఫరా, వ్యవసాయ అవసరాలు, పశువుల సంరక్షణ, నీటి వనరుల పరిరక్షణ వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీల సామర్థ్యాన్ని పెంపొందించి అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వేగంగా పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. స్థానిక అవసరాలను గుర్తించి ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టాలని, గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ఐలయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు, వర్షాభావ పరిస్థితులకు తీసుకోవాల్సిన చర్యలపై వారు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

# అంబర్‌పేట బోనాలకు సన్నాహాలు

- ఆగస్టు 9 ఉత్సవాలకు అధికారులకు ఆదేశాలు
- భక్తులకు అసౌకర్యం లేకుండా విస్తృత ఏర్పాట్లు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచన
- భద్రత, రవాణా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు



**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం ):** అంబర్‌పేట మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు అధికారులను ఆదేశించారు. అంబర్‌పేట మహంకాళి అమ్మవారి బోనాల ఏర్పాట్లపై బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఆగస్టు 9న అంబర్‌పేట మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ, ట్రాన్స్‌కో, పోలీసు, జలమండలి, వైద్యారోగ్య శాఖ, సాంస్కృతిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.

తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు విశిష్ట స్థానం ఉందని హనుమంతరావు పేర్కొన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు కొనసాగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా జరిగే ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, సాక సమర్పణ, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, రంగం, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఈ సంప్రదాయాల నిర్వహణలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సీసీ కెమెరాలు, క్యూలైన్లు, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే భారీ రద్దీ ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు అమలు చేయడంతో పాటు అదనపు బస్సులు, భద్రతా సిబ్బంది, వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో శాసనమండలి సభ్యుడు బల్మూర్ వెంకట్, ఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, సమాచార, పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకుడు డి.ఎస్. జగన్, జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఆర్టీసీ, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు కేటాయించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు.

# విస్తరణపై సింగరేణి దృష్టి

- ఆప్మెల్‌కు సౌర శక్తి
- స్వర్ణోత్సవ వేళ 300 కిలోవాట్ల ప్లాంట్ ప్రారంభం
- విద్యుత్ ఖర్చులో భారీ ఆదా
- రికార్డు లాభాలతో కొత్త చరిత్ర




**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం ):** సింగరేణి అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఆప్మెల్) స్వర్ణోత్సవాల సందర్భంగా విజయవాడ ప్లాంటులో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే ప్లాంటులో కొత్తగా నిర్మించిన సీసీ, ఆర్‌సీసీ రోడ్లను కూడా ప్రారంభించి మౌలిక సదుపాయాల విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గనిర్దేశంలో సింగరేణితో పాటు ఆప్మెల్‌ను బహుముఖ వ్యాపార సంస్థగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ కొనసాగుతోందన్నారు. సంస్థ 50 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.63.13 కోట్ల టర్నోవర్‌తో పాటు రూ.23.33 కోట్ల రికార్డు స్థాయి నికర లాభాన్ని నమోదు చేయడం ఉద్యోగుల సమష్టి కృషికి నిదర్శనమని అభినందించారు.

గత ఏడాది ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆప్మెల్‌ను సందర్శించిన సందర్భంగా ఇచ్చిన సూచనల మేరకు ప్లాంటులో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టినట్లు తెలిపారు. సీసీ, ఆర్‌సీసీ రోడ్ల నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్లాంటు నిర్వహణ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1, 1976న ప్రారంభమైన ఆప్మెల్ ఈ ఏడాది స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో సంస్థను ఆధునిక అవసరాలకు అనుగుణంగా విస్తరించాలని సీఎండీ పిలుపునిచ్చారు. ప్రస్తుతం తయారుచేస్తున్న యంత్ర పరికరాలు, విడిభాగాలతో పాటు వివిధ పరిశ్రమలకు అవసరమైన ఆధునిక ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సింగరేణి నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

రూ.1.24 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా సంస్థ విద్యుత్ వినియోగ వ్యయంలో గణనీయమైన ఆదా సాధించనుంది. ప్లాంటు, కాలనీ అవసరాల కోసం ప్రస్తుతం ఏటా సుమారు రూ.60 లక్షల విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న సంస్థకు ఈ సౌర విద్యుత్ ప్లాంట్ వల్ల ఏటా సుమారు రూ.24 లక్షల వరకు ఆదా కానుంది. ఐదేళ్లలో పెట్టుబడి మొత్తం తిరిగి సమకూరడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది దోహదపడనుంది. ఆప్మెల్ ఛైర్మన్ ఎన్‌వీకే శ్రీనివాస్ సంస్థ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. సింగరేణి, కోల్ ఇండియా, ఎన్‌ఎండీసీ వంటి సంస్థల నుంచి వచ్చిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, సింగరేణి అధికారులు, విజయవాడ ఆప్మెల్ యాజమాన్యం, ఉద్యోగులు పాల్గొన్నారు. స్వర్ణోత్సవ సంవత్సరంలో సంస్థను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే దిశగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# చెరకు సాగుకు కార్యాచరణ

- చక్కెర పరిశ్రమల పునరుద్ధరణపై సమీక్ష
- ఇతర రాష్ట్రాల విధానాల అధ్యయనానికి ఆదేశం
- రైతులకు ప్రోత్సాహకాలపై ప్రతిపాదనలు:సీ ఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం):** రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమలను పునరుద్ధరించి వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు సాగు విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం బుధవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. రాష్ట్రంలోని చక్కెర పరిశ్రమల ప్రస్తుత పరిస్థితి, చెరకు సాగు విస్తీర్ణం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిశ్రమలకు ముడి చెరకు లభ్యత వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం కేవలం ఏడు కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు. ఉత్పత్తి పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వరి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, బిందు సేద్యం వంటి ఆధునిక పద్ధతులను అనుసరిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని ప్రధాన కార్యదర్శి తెలిపారు. 2026--27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ప్రోత్సాహక పథకాలు, విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను తక్షణమే సమర్పించాలని సంబంధిత అధికారులకు ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు నిరంతరం అందేలా రైతులను ప్రోత్సహించే చర్యలను రూపొందించాలని సూచించారు. సమావేశంలో రైతు ప్రతినిధులు చెరకు రైతులకు కూడా వరి రైతులకు అందిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ కూలీల కొరత ప్రధాన సమస్యలుగా ఉన్నాయని వివరించారు. చెరకు ద్వారా చక్కెరతో పాటు ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుందని, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందిస్తే రైతులకు, పరిశ్రమలకు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

# ఏఐఓబీసీఎస్ఏ జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



- మండల్ దివస్ సందర్భంగా జాతీయ సదస్సుకు సన్నాహాలు
- పూలే 200వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడి
- పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం ):** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆగస్టు 7న నిర్వహించనున్న ఏఐఓబీసీఎస్ఏ (అఖిల భారత ఇతర వెనుకబడిన వర్గాల విద్యార్థి సంఘం) ఆరో జాతీయ మహాసభ పోస్టర్‌ను మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. మండల్ దివస్ సందర్భంగా, 1990లో మండల్ కమిషన్ నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన చారిత్రక దినాన్ని స్మరించుకుంటూ, మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఈ మహాసభను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధనలో మండల్ కమిషన్ సిఫారసులు దేశ చరిత్రలో కీలక మలుపుగా నిలిచాయని అన్నారు. వెనుకబడిన వర్గాల విద్యా, ఉపాధి, సామాజిక అభివృద్ధికి ఆ నిర్ణయాలు విశేషంగా దోహదపడ్డాయని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే చూపిన సామాజిక సంస్కరణల మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.

ఆగస్టు 7న జరిగే జాతీయ మహాసభలో వెనుకబడిన వర్గాల సాధికారత, విద్యా అవకాశాల విస్తరణ, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చలు జరగనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థి నాయకులు, సామాజికవేత్తలు, మేధావులు, ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభ ద్వారా వెనుకబడిన వర్గాల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించి, వారి అభ్యున్నతికి అవసరమైన సూచనలు, తీర్మానాలను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. యువతలో చైతన్యం పెంపొందించడంతో పాటు సమాన హక్కుల సాధన దిశగా ఈ సమావేశం కీలక వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు డా. కిరణ్ కుమార్, జాతీయ కార్యదర్శి శివ యాదవ్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన రాకేష్ దత్తా, మహేంద్ర యూనివర్సిటీకి చెందిన శ్రీహర్షిత, రజనీకాంత్, మల్లేష్, శ్రావణ్ కురుమతో పాటు పలువురు నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. జాతీయ మహాసభ విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై వారు చర్చించారు. పోస్టర్ ఆవిష్కరణతో జాతీయ మహాసభ ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. మండల్ దివస్, మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించే ఈ మహాసభ సామాజిక న్యాయం, సమానత్వం, వెనుకబడిన వర్గాల సాధికారత అంశాలను మరింత బలోపేతం చేసే వేదికగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరం ప్రారంభం



- ముందస్తు పరీక్షలతోనే వ్యాధిని జయించొచ్చని హరీశ్ రావు
- వెయ్యి పడకల ఆసుపత్రికి నిధులు విడుదల చేయాలని డిమాండ్

**సిద్దిపేట, జూలై 29 (మన విశ్వం):** సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో హైదరాబాద్‌కు చెందిన సింధు క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రెండు రోజుల ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు, నిర్వాహకులు, ప్రజలతో కలిసి శిబిరాన్ని పరిశీలించిన ఆయన, క్యాన్సర్‌పై ముందస్తు అవగాహన, పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ క్యాన్సర్ అంటే భయపడాల్సిన అవసరం లేదని, ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సమర్థవంతంగా చికిత్స అందించవచ్చని అన్నారు. ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా సమయం కేటాయించి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు.

తాను వైద్య శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో క్యాన్సర్ రోగులు ఎదుర్కొనే ఇబ్బందులను దగ్గర నుంచి చూశానని హరీశ్ రావు తెలిపారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో డాక్టర్ పార్థసారథి సింధు క్యాన్సర్ ఆసుపత్రిని స్థాపించడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సిద్దిపేటలో శాశ్వతంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హరీశ్ రావు వెల్లడించారు. ఇందుకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి తరహాలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విధంగా ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సిద్దిపేటలో వెయ్యి పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామని హరీశ్ రావు గుర్తు చేశారు. ప్రస్తుతం ఆసుపత్రి నిర్మాణ పనులు 95 శాతం పూర్తయ్యాయని, మిగిలిన ఐదు శాతం పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆరోపించారు. దీంతో ప్రజలకు అందుబాటులోకి రావాల్సిన ఆసుపత్రి ఆలస్యమవుతోందని అన్నారు. వెయ్యి పడకల ఆసుపత్రికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ వైద్య రంగంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## గడువులోగా భూసేకరణ పూర్తి చేయాలి

**- ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల పురోగతిపై కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష**

**- పరిహారం, అవార్డులు, భూ స్వాధీన ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశం**



**వరంగల్, జూలై 29 (మన విశ్వం):** జిల్లాలో ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల అమలులో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులో భూసేకరణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జే. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం, కొనైమాకుల ఎత్తిపోతల పథకం, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, ఇన్నర్ రింగ్ రోడ్, జాతీయ రహదారి--163జీ, రైల్వే ప్రాజెక్టులు, విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, భూ స్వాధీనం, పరిహారం చెల్లింపులు, అవార్డు ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సవివరంగా చర్చించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, పనులు ఆలస్యం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసరావు, జోనల్ మేనేజర్ స్వామి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆనందం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

**- సిద్దిపేటలో నిర్వహించిన అభినందన కార్యక్రమం**

**- పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాలని హరీశ్ రావు పిలుపు**

**సిద్దిపేట, జూలై 29 (మన విశ్వం):** కేఆర్ ఉచిత ఇంజనీరింగ్, కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు సాధించిన విద్యార్థులను సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సన్మానించారు. జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో సీట్లు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీటు సాధించడం సాధారణ విషయం కాదన్నారు. ఒక సీటు విద్యార్థి జీవితాన్నే కాకుండా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని కూడా మార్చగలదని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును మార్చాలనే లక్ష్యంతో కేఆర్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేసి ఉచితంగా మార్గనిర్దేశం చేస్తున్న కొలుపుల రాములు సేవలు ప్రశంసనీయమని అన్నారు.

ఒక ఉపాధ్యాయుడిగా సామాజిక బాధ్యతతో వేలాది మంది విద్యార్థులకు వాట్సాప్ ఛానళ్లు, కౌన్సిలింగ్ ద్వారా అండగా



నిలవడం గొప్ప విషయమని హరీశ్ రావు కొనియాడారు. ఒకప్పుడు ఐఐటీ, ఎన్ఐటీ సీట్లు కేవలం నగరాల్లోని కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులకే వస్తాయనే అభిప్రాయం ఉండేదని, ఇప్పుడు గ్రామీణ విద్యార్థులు కూడా పట్టుదల, ఏకాగ్రతతో అద్భుత విజయాలు సాధిస్తున్నారని అన్నారు. కొలుపుల రాములు మార్గదర్శకత్వంలో ఇప్పటికే సుమారు మూడు వేల మంది విద్యార్థులు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందడం గొప్ప మార్పునకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువు పూర్తయ్యాక కేవలం ప్రైవేటు ఉద్యోగాలకే పరిమితం కాకుండా సివిల్ సర్వీసులు, రక్షణ రంగం, ఇతర అఖిల భారత సేవలపై దృష్టి సారించాలని సూచించారు. జాతీయ స్థాయిలో తెలంగాణ యువత ప్రాతినిధ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు.

చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాలు అడిగే వారిగా కాకుండా, తమ నైపుణ్యంతో మరెందరికో ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కృత్రిమ మేధ, అంతర్జాల సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో వినూత్న ఆలోచనలతో కొత్త సంస్థలు ప్రారంభించే దిశగా యువత ముందుకు రావాలని సూచించారు. ప్రపంచ స్థాయి సంస్థలను ఆకర్షించే సామర్థ్యం భారత యువతకు ఉందని అన్నారు. విద్యార్థులు ఎప్పుడూ పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఒకటి రెండు అపజయాలు ఎదురైనా నిరాశ చెందకుండా లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని హరీశ్ రావు సూచించారు. ఇప్పటికే అత్యుత్తమ విద్యాసంస్థల్లో సీట్లు సాధించి తమ ప్రతిభను నిరూపించుకున్న విద్యార్థులు భవిష్యత్తులోనూ అదే ఆత్మవిశ్వాసంతో మరిన్ని విజయాలు సాధించి తమ తల్లిదండ్రులకు, సిద్దిపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఫామ్ పౌండ్ పనుల పరిశీలన

**- గుంతకోడూరులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**- పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

**- రైతులకు సాగునీరు, అదనపు ఆదాయంపై దృష్టి**

**- కూలీల పెండింగ్ వేతనాల విడుదలకు హామీ**



**నాగర్‌కర్నూల్, జూలై 29 (మన విశ్వం ):** నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం గుంతకోడూరు గ్రామంలో వీబీ-జీ రామ్‌జీ పథకం కింద నిర్మిస్తున్న ఫామ్ పౌండ్ పనులను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫామ్ పౌండ్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల్లో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రణాళికాబద్ధంగా పనులను వేగవంతం చేసి రైతులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఫామ్ పౌండ్ల ద్వారా రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడటంతో పాటు వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసుకునే అవకాశంతో పాటు రైతులకు అదనపు ఆదాయ వనరులు కూడా ఏర్పడతాయని పేర్కొన్నారు. పనుల్లో పాల్గొంటున్న కూలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాల విషయాన్ని కూలీలు ప్రస్తావించగా, వాటిని త్వరితగతిన విడుదల చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పథకం అమలులో పారదర్శకత, నాణ్యత పాటిస్తూ ప్రతి పనిని సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రత్యక్ష ప్రయోజనాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఫామ్ పౌండ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత సాగునీటి వనరులు మెరుగుపడటంతో పాటు వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని అధికారులు తెలిపారు. రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

**- విద్యార్థుల ప్రతిభపై ప్రశంసలు**

**- శతశాతం ఫలితాలే లక్ష్యంగా సూచనలు**

**- వంటగది పరిశుభ్రతపై ఆదేశాలు**

**- బోధన నాణ్యతపై ప్రత్యేక దృష్టి**

**నారాయణపేట, జూలై 29 (మన విశ్వం ):** నారాయణపేట జిల్లా కోటకొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, బోధన తీరు, మధ్యాహ్న భోజన నిర్వహణతో పాటు విద్యా ప్రమాణాలను పరిశీలించారు. పాఠశాల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడితో పాటు మరో ఉపాధ్యాయుడు శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఒక ఉపాధ్యాయుడు సెలవులో ఉండగా, మరో ఉపాధ్యాయురాలు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైనట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. విధుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని స్పష్టం చేస్తూ హాజరు వ్యవస్థను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ఆరో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన కలెక్టర్ వారి అభ్యాస సామర్థ్యాన్ని





పరిశీలించి అభినందించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. గత విద్యా సంవత్సరంలో సాధించిన ఫలితాలను ఈసారి కూడా కొనసాగిస్తూ పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించే లక్ష్యంతో చదవాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులతో పోటీ పడాల్సి ఉంటుందని గుర్తుంచుకుని క్రమశిక్షణతో సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను అదే రోజు పునశ్చరణ చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని, ముఖ్యంగా బాలికలు ఆర్థిక స్వావలంబన సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ప్రోత్సహించారు. అనంతరం పాఠశాల డైనింగ్ హాల్, మధ్యాహ్న భోజన నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే వంటగది పరిసరాల్లో అపరిశుభ్రతను గుర్తించి వెంటనే శుభ్రత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలను ఎంపీడీవో తరచూ సందర్శించి నిర్వహణను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. వంటగదిలో తగిన వెలుతురు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## అత్యవసరాలకు పోలీసుల సన్నద్ధత









**- ఉప్పల్ ఎన్‌జీఆర్ఐలో భద్రతా మాక్ డ్రిల్**

**- కీలక ప్రాంతాల్లో క్షుణ్ణ తనిఖీలు**

**- భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష**

**- అప్రమత్తతే ప్రధాన లక్ష్యమన్న పోలీసులు**

**హైదరాబాద్, జూలై 29 (మన విశ్వం ):** అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే సన్నద్ధతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీసులు ఉప్పల్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (ఎన్‌జీఆర్ఐ)లో భద్రతా మాక్ డ్రిల్ నిర్వహించారు. కీలక సంస్థల భద్రతను మరింత పటిష్ఠం చేయడానికి చేపట్టిన ఈ విన్యాసంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. మాక్ డ్రిల్ సందర్భంగా సంస్థ ప్రాంగణంతో పాటు ఇతర కీలక ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సమయంలో అనుసరించాల్సిన చర్యలు, స్పందన విధానాలను ఆచరణాత్మకంగా పరిశీలించి సిబ్బందికి అవగాహన కల్పించారు.

భద్రతా ఏర్పాట్లపై అధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించారు. సంస్థలో అమలులో ఉన్న భద్రతా వ్యవస్థలు, ప్రవేశ నియంత్రణ, అనుమానాస్పద పరిస్థితులను గుర్తించే విధానాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వివిధ విభాగాల మధ్య సమన్వయం మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సున్నితమైన, కీలక సంస్థల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు. విపత్తులు లేదా భద్రతాపరమైన ఘటనలు సంభవించినప్పుడు వేగంగా స్పందించేందుకు ఇలాంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల్లో భద్రతపై విశ్వాసాన్ని బలోపేతం చేయడమే ఇటువంటి విన్యాసాల ప్రధాన ఉద్దేశమని పోలీసులు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా కీలక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఇలాంటి మాక్ డ్రిల్‌లను నిర్వహిస్తూ భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. మల్కాజిగిరి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. భద్రతా సిబ్బంది, సంబంధిత అధికారులు సమన్వయంతో పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన, సమర్థవంతమైన నిర్వహణకు అవసరమైన విధానాలను మరోసారి సాధన చేశారు.

## పారిశుధ్యానికి ఆధునిక పరికరాలు

**- రహదారి శుభ్రతకు కొత్త సాంకేతికత**

**- జర్మన్ సంస్థతో కలిసి ప్రదర్శన**

**- పారిశుధ్య కార్మికుల శ్రమ తగ్గింపే లక్ష్యం**

**- సరికొత్త పరికరాలపై సీఎంసీ పరిశీలన**

**హైదరాబాద్, జూలై 29(మన విశ్వం ):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జర్మనీకి చెందిన కార్చర్ సంస్థ సహకారంతో రహదారులను చేతితో శుభ్రం చేసే ఆధునిక పరికరాల ప్రదర్శనను బుధవారం నిర్వహించింది. పారిశుధ్య కార్మికులు రోజువారీ రహదారి శుభ్రత పనులను మరింత సులభంగా, వేగంగా నిర్వహించేందుకు ఈ పరికరాలను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. శుభ్రత పనుల్లో సమయాన్ని ఆదా చేయడంతో పాటు పనితీరును



మెరుగుపరచడం ఈ పరికరాల ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ పరికరాల వినియోగంతో పారిశుధ్య కార్మికులపై పడే శారీరక శ్రమ గణనీయంగా తగ్గుతుందని అధికారులు తెలిపారు. అదే సమయంలో ప్రజా ప్రదేశాల్లో పరిశుభ్రతను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య సేవలను ఆధునికీకరించేందుకు వివిధ సాంకేతిక పరిజ్ఞానాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి అనుకూలంగా ఉండే, తక్కువ వ్యయంతో ఎక్కువ ఫలితాలు ఇచ్చే పరికరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపింది.

పారిశుధ్య సేవల నాణ్యతను మెరుగుపరచడం, నగర పరిశుభ్రతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఇటువంటి వినూత్న పరికరాలను పరీక్షిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. సాంకేతికత ఆధారిత పరిష్కారాల ద్వారా ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కృషి కొనసాగిస్తోందని తెలిపారు. జర్మన్ సంస్థతో కలిసి నిర్వహించిన ఈ ప్రదర్శనలో సంబంధిత అధికారులు, పారిశుధ్య విభాగం సిబ్బంది పాల్గొని పరికరాల పనితీరును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో వాటి సామర్థ్యాన్ని అంచనా వేసిన అనంతరం అవసరమైన మేర వినియోగంపై నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- బూత్ స్థాయి ప్రతినిధులకు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపు**

**- అర్హులైన ప్రతి ఓటరు నమోదు కావాలని సూచన**

**- ప్రక్రియ పూర్తికి ఐదు రోజులే గడువు**

**- ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని ఆదేశం**



**సంగారెడ్డి, జూలై 29 (మన విశ్వం ):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను నమోదు చేసుకునేలా కృషి చేయాలని పటాన్‌చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులకు సూచించారు. బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు. భారతీ నగర్, రామచంద్రాపురం డివిజన్లకు చెందిన బూత్ స్థాయి ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం అవసరమని తెలిపారు.

పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేస్తున్నప్పటికీ నమోదు శాతం ఆశించిన స్థాయిలో లేదని ఆయన పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియడానికి కేవలం ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇప్పటివరకు నమోదు చేయించుకోని అర్హులైన ఓటర్లను స్వయంగా కలిసి ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అవసరమైన వివరాలు నమోదు చేసుకునేలా సహకరించాలని బూత్ స్థాయి ప్రతినిధులకు సూచించారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఓటు విలువైనదని గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, పృథ్వీరాజ్, ఐలేష్, ప్రమోద్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# పార్టీ నియమాలను అనుసరించాలి

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టిడిపిలో చేరిక**





**విజయనగరం, జులై 29** తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు కూడా పార్టీ నియమాలను అనుసరించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. విజయనగరంలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయం నందు బుధవారం గజపతినగరం నియోజకవర్గ బొండపల్లి మండలం మరువాడ కొత్తవలస గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు 50 కుటుంబాల వారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకులు వలవల బాబ్జి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో ప్రతి ఒక్కరు నిబద్ధత పనిచేయాలని, తెలుగుదేశం పార్టీ నాయకుల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. వైసీపీ సీనియర్ నాయకులు కోరాడ సత్యనారాయణ, మాజీ వార్డ్ మెంబర్ పల్లి సత్యం వారి అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండల రావు గారు, టిడిపి మండల ప్రెసిడెంట్ రాపాక అచ్చం నాయుడు, మాజీ సర్పంచ్ కర్రోతు , టిడిపి గ్రామ ప్రెసిడెంట్ పెన్నింటి తవుడు తదితరులు పాల్గొన్నారు.

# గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారినీ కలసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, జులై 29,**
గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారిని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు గవర్నర్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అరగంటకు పైగా ఇష్టాగోష్టి నిర్వహించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన, మీరు పునాది వేసిన భోగాపురం ఎయిర్పోర్ట్ తమరి కల మరో రెండు రోజులలో సాకారం కావడం చాలా ఆనందాన్ని కలిగిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విమానయాన రంగంలో జీఎంఆర్ సంస్థకు మంచి అనుభవం ఉందని, త్వరితగతిన పూర్తి చేసిన జీఎంఆర్ సంస్థకు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారు అభినందనలు తెలిపారు. విమానాశ్రయానికిప్రభుత్వం అల్లూరి సీతారామరాజు నామకరణం చేయటం శుభ పరిణామం అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ప్రారంభించడం బాగున్నదన్నారుపరిశ్రమలు, రవాణా వ్యవస్థ బాగుంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆ దిశగా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని గవర్నర్ సూచించారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గారు తదితరులు పాల్గొన్నారు.

# వరదతో రాకపోకలకు అంతరాయం

**- దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును పరిశీలించిన కలెక్టర్**
**- ప్రత్యామ్నాయ మార్గం పునరుద్ధరణకు ఆదేశాలు**
**- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన**
**- అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశం**

**ములుగు, జూలై 29 (మన విశ్వం ):** వాజేడు మండలం చీకుపల్లి--పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు భారీ వర్షాల కారణంగా దెబ్బతినడంతో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రత్యామ్నాయ రహదారిని అత్యవసరంగా పునరుద్ధరించి రాకపోకలను పునరుద్ధరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా ఇసుకవాగులో వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు దెబ్బతింది. దీంతో తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను అనుసంధానించే జాతీయ రహదారి--163పై వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది.



ప్రయాణికుల భద్రత దృష్ట్యా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, వరద ప్రవాహం తగ్గిన వెంటనే ప్రత్యామ్నాయ రహదారిని పునరుద్ధరించి వాహనాల రాకపోకలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రహదారి పునరుద్ధరణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.
ప్రస్తుతం వరద ఉధృతి అధికంగా ఉండటంతో డైవర్షన్ రోడ్డుకు ఇరువైపులా కాల్వలు తవ్వి వరద నీటిని మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పైపులు దెబ్బతినకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వరద తగ్గిన వెంటనే రహదారిని తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. పరిశీలన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కొండా కృపాకర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, అత్యవసర పరిస్థితుల్లో జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

# చెల్లూరు హైవే జంక్షన్ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రుల బృందం



**విజయనగరం, జులై 29,**
ప్రధాని నరేంద్ర మోడీ గారి సభ సమావేశానికి వచ్చి తిరిగి వెళ్లే ప్రజానీకానికి భోజనాలు ఏర్పాటు చేయడం కోసం చెల్లూరు హైవే జంక్షన్ ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం మంత్రులు బృందం పరిశీలించారు. మంత్రులు అచ్చం నాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, దామచర్ల సత్య, బీద రవిచంద్ర, కిలారు రాజేష్, కోటంరెడ్డి గిరిధర్ గార్లు కలిసి హైవే జంక్షన్ ప్రాంతాలను పరిశీలించారు. జంక్షన్ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలంలో ఎక్కువ మంది ప్రజలు భోజనాలు చేసేందుకు వీలు కల్పించి తగిన ఏర్పాట్లు చేయటానికి పరిశీలన జరిపినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో సుమారు 20 వేల మంది భోజనాలు చేయటానికి వీలు పడుతుందనే అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రుల బృందం, అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపారు.

# గురువుల సేవలు అమూల్యం

**- గురువుల అంకితభావాన్ని కొనియాడిన కమిషనర్**
**- విద్యార్థులకు విలువలతో కూడిన విద్యపై సూచనలు**
**- సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాలని పిలుపు**

**సికింద్రాబాద్, జూలై 29 (మన విశ్వం ):** శ్రీ గురు పూర్ణిమ మహోత్సవం--2026 సందర్భంగా సికింద్రాబాద్ మహబూబ్ కాలేజ్ హైస్కూల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువుల సేవలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని గురు–శిష్య సంబంధం ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పోలీస్ కమిషనర్, భావితరాల నిర్మాణంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తూ జ్ఞానాన్ని అందించడమే కాకుండా, మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అమూల్యమని కొనియాడారు. సమాజ నిర్మాణానికి



గురువుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను జీవితంలో అలవరచుకోవాలని కమిషనర్ సూచించారు. లక్ష్యసాధన కోసం కష్టపడి చదవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. గురువుల మార్గదర్శకత్వాన్ని జీవితాంతం గౌరవించాలని సూచించారు.
నేటి డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడం ఎంతో అవసరమని కమిషనర్ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలు, అంతర్జాలాన్ని బాధ్యతాయుతంగా వినియోగిస్తూ సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంకేతికతను విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. గురు పూర్ణిమ సందర్భంగా విద్యార్థులు తమ గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేయాలని కమిషనర్ అన్నారు. గురువులు అందించే విలువలు, బోధనలు జీవితాంతం మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్య, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగితే ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురు పూర్ణిమ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమం విద్యార్థుల్లో గురువుల పట్ల గౌరవభావాన్ని మరింత పెంపొందించేలా సాగింది.

# ఎన్టీఆర్ జిల్లా ఐ.టి.ఐ లలో రెండవ విడత అడ్మిషన్లు..

**- జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు**




**విజయవాడ,29.07.2026.**
ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ఐ.టి.ఐ లలో 2026-27/28 విద్యా సంవత్సరానికి గాను రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ మరియు జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 6వ తేదీన విజయవాడలోని ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రాంగణంలో అడ్మిషన్ల కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు.అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ ఆధారంగా నిర్ణీత తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఐ.టి.ఐ లలో ప్రవేశం పొందే వారిలో ఎస్.సి., ఎస్.టి. అభ్యర్థులు మినహా మిగిలిన కేటగిరీల అభ్యర్థులు రూ. 60/- కాషన్ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ప్రైవేటు ఐ.టి.ఐ లలో చేరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ సమాచారం కోసం విజయవాడ ప్రభుత్వ ఐ.టి.ఐ లోని జిల్లా కన్వీనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చునన్నారు.
ఇతర వివరాలకు 0866-2475575, 94906 39639, లేదా 77804 29468 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని కన్వీనర్ ఆ ప్రకటనలో తెలిపారు.


# విత్తనం నాటిన ప్రతి రైతుకు ఫసల్ బీమా..!

**- రైతుల ఆర్థిక భద్రతకు పథకంలో 100 శాతం నమోదు అవసరం..**
**- ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి**
**- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందంజలో నిలపాలి**
**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్‌టీఆర్ జిల్లా --విజయవాడతేదీ: జులై 29, 2026**
జిల్లాలో రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, ప్రజారోగ్యం, వరదల నివారణ, రెవెన్యూ సేవలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లాస్థాయి అధికారులతో కలసి కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద విత్తనం నాటిన ప్రతి రైతును తప్పనిసరిగా పంటల బీమా పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లాలో 100 శాతం నమోదు లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పంట మార్పిడి (క్రాప్ డైవర్సిఫికేషన్)పై ప్రతి మండల వ్యవసాయ అధికారి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ఇప్పటి వరకు ఎంతమంది రైతులు ఎంత విస్తీర్ణంలో పంట మార్పిడి చేపట్టారో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎరువుల లభ్యత, పంపిణీపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ కనీసం రెండు నుంచి మూడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. రైతులకు సమస్యలు ఎదురైతే కలెక్టరేట్ యూనిఫైడ్ కాల్ సెంటర్ (91549 70454)ను సంప్రదించే విధంగా అన్ని ఎరువుల దుకాణాల వద్ద హెల్ప్‌లైన్ నంబర్‌ను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో సీడ్ పెల్లెటింగ్‌ను ప్రతి రైతుకు విస్తృతంగా అమలు చేయాలని, ఇది కేవలం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే కాకుండా అందరికీ వర్తించే సాంకేతిక విధానమని వివరించారు. సీడ్ పెల్లెటింగ్ వల్ల మొలక శాతం మెరుగుపడటంతో పాటు తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో కూడా త్తనం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. రైతులకు అవసరమైన శిక్షణ అందించాలని ఆదేశించారు.హరిత విస్తీర్ణంపై దృష్టిపెట్టండి: నెట్ జీరో' లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. మొదట సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, హాస్టళ్లలో ప్రారంభించి అనంతరం అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు విస్తరించాలని సూచించారు. గ్రామపంచాయతీలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను హరితవనాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఒకే బృందంలా పనిచేయాలని, అధికారులు తమ శాఖలకే పరిమితం కాకుండా జిల్లా అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లాను ముందు వరుసలో నిలపడానికి కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ దిశానిర్దేశం చేశారు. వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు సన్నద్ధత, 22ఏ దరఖాస్తుల పరిష్కారం తదితరాల పైనా కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు.

# రెండు భాగాలుగా అల్లు,అట్లీల రాకా మూవీ

## వేయికోట్ల బడ్జెట్‌తో ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం




టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# పెళ్లిచూపులు మూవీకి పదేళ్లు

## దర్శకుడిగా తరుణ్ భాస్కర్‌కు హిట్ -నటులుగా విజయ్ దేవరకొండ, రీతూవర్మలకు గుర్తింపు

తెలుగు సినీ పరిశ్రమలో చిన్న సినిమాగా విడుదలై సంచలన విజయాన్ని అందుకున్న 'పెళ్లిచూపులు' విడుదలై జులై 29 పదేళ్లు పూర్తి చేసుకుంది. విజయ్ దేవరకొండ, రీతూ వర్మ జంటగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 2016లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడమే కాకుండా, తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. దర్శకుడిగా తరుణ్ భాస్కర్ పరిచయమైన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత డి. సురేశ్ బాబు సమర్పణలో రాజ్ కందుకూరి, యష్ రంగినేని సంయుక్తంగా నిర్మించారు. సహజమైన కథనం, వినోదభరితమైన సంభాషణలు, కొత్త తరహా స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని పలువురు ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు తెచ్చిపెట్టింది. 'పెళ్లిచూపులు' విజయ్ దేవరకొండ కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. సోలో హీరోగా ఆయనకు ఇది తొలి పెద్ద విజయం. సినిమాలో విజయ్ నటన,
సహజమైన డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా విజయంతో వరుస అవకాశాలు అందుకున్న విజయ్, ఆ తర్వాత 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' వంటి విజయాలతో స్టార్ హీరోగా ఎదిగారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రీతూ వర్మ తన సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు దక్కించుకుని ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందింది. ఇక దర్శకుడు తరుణ్ భాస్కర్ తొలి సినిమాతోనే తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్నారు. 'పెళ్లిచూపులు' తర్వాత టాలీవుడ్‌లో క్రేజీ దర్శకుడిగా ఎదిగిన ఆయన, అనంతరం నటుడిగానూ తనదైన గుర్తింపు సంపాదించారు.బాక్సాఫీస్ దగ్గర మంచి విజయంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పెళ్లిచూపులు' అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులను కూడా సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు లభించాయి. ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా 'పెళ్లిచూపులు' జాతీయ పురస్కారం అందుకోగా, ఉత్తమ మాటల రచయితగా దర్శకుడు తరుణ్ భాస్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. అలాగే 2016 సంవత్సరానికి గాను ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి విభాగాల్లో రెండు నంది అవార్డులు కూడా ప్రకటించబడ్డాయి.




ఇందులో రీతూ వర్మ ఉత్తమ నటి అవార్డుకు ఎంపికయ్యారు. అయితే ఆ సమయంలో నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర సినీ పురస్కారాల్లో కూడా 'పెళ్లిచూపులు'కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ చిత్రాన్ని సెకండ్ బెస్ట్ మూవీగా ఎంపిక చేసి చిత్రబృందాన్ని సత్కరించింది. దీంతో విడుదలై పదేళ్లు పూర్తయినా 'పెళ్లిచూపులు' ప్రస్థానం ఇంకా కొనసాగుతూనే ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 'రామాయణం' తర్వాత మరో మైథాలజీ..

## సాయి పల్లవి కొత్త ప్రాజెక్ట్ ఫిక్స్!

సినిమా ఇండస్ట్రీలో సింప్లిసిటీకి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఏకైక నటి సాయి పల్లవి. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండి, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో సౌత్ నుంచి నార్త్ వరకు అగ్ర హీరోయిన్‌గా దూసుకుపోతోంది. త్వరలో 'రామాయణం'లో సీతగా కనిపించనున్న ఈ సహజ నటి, మరో మైథాలజీ సినిమాకు కూడా ఓకే చెప్పినట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. వివరాలు చూద్దాం.. ప్రత్యేకమైన పాత్రలతో సరికొత్త ట్రెండ్: ఇండస్ట్రీలో చాలామంది హీరోయిన్లకు తమ వర్సటాలిటీని నిరూపించుకునే అవకాశాలు తక్కువగా వస్తుంటాయి. కానీ సాయి పల్లవి మాత్రం కథల ఎంపికలో సరికొత్త ట్రెండ్ సెట్ చేస్తోంది. ఇక మీడియం రేంజ్ హీరోల నుంచి పాన్ ఇండియా సినిమాల వరకు, నటనకు స్కోప్ ఉన్న పాత్రలనే ఎంచుకుంటూ ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. ఇప్పుడు సౌత్ నుంచి నార్త్ వరకు బిజీ హీరోయిన్‌గా మారింది. వెండితెర సీతమ్మగా అలరించేందుకు సిద్ధం: ప్రస్తుతం ఆడియన్స్ అందరూ ఈ దీపావళికి థియేటర్లలోకి రాబోతున్న 'రామాయణం' సినిమా కోసం తీవ్ర ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇందులో సీతమ్మ పాత్రలో సాయి పల్లవి కనిపించబోతోంది. ఈ బాలీవుడ్ విజువల్ వండర్‌లో ఆమె పర్ఫార్మెన్స్ ఎలా ఉండబోతోందో అని దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు చాలా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. 'తండేల్' తర్వాత మరో తెలుగు ప్రాజెక్ట్: తెలుగులో 'తండేల్' సినిమా తర్వాత సాయి పల్లవి కొత్తగా ఏ ప్రాజెక్ట్‌కూ సంతకం చేయలేదు. దీంతో ఆమె తదుపరి తెలుగు సినిమా ఏదోనని ఫ్యాన్స్‌లో ఆసక్తి పెరిగింది. అయితే తాజాగా దర్శకుడు కిషోర్ తిరుమల ఆమెకు ఒక పవర్‌ఫుల్ కథ చెప్పినట్లు తెలుస్తోంది. ఇక 'అమ్మోరు' తరహా కథాంశంతో సాగే ఒక మైథాలాజికల్ కథకు సాయి పల్లవి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. క్యూలో ఉన్న సౌత్ ప్రాజెక్టులు: ఒకవైపు మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతికి జోడీగా ఒక సినిమా, అలాగే ధనుష్‌తో 'ఓమ్' అనే తమిళ చిత్రంలో నటిస్తూ సాయి పల్లవి బిజీగా ఉంది. ఇక ఈ కమిట్‌మెంట్స్ పూర్తి కాగానే కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కే ఈ భారీ మైథాలజీ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. 'రామాయణం' తర్వాత సాయి పల్లవి కెరీర్‌లో రాబోతున్న వరుసగా రెండో మైథాలాజికల్ ఫిల్మ్ ఇది కావడం విశేషం. దేవుళ్ల కథ నేపథ్యం, భారీ బడ్జెట్‌తో తెరకెక్కే ఇలాంటి చిత్రాలలో సాయి పల్లవి తనదైన నటనతో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి. ఈ వార్త నిజమైతే సాయి పల్లవి ఫ్యాన్స్‌కు పండుగే అని చెప్పాలి.



# 8న గ్రాండ్‌గా టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ప్లాన్




యశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ సినిమా నుంచి భారీ అప్‌డేట్ సిద్ధమైంది. 'టాక్సిక్' చిత్రబృందం ఆగస్టు 8న బెంగళూరులో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్‌ను ప్లాన్ చేస్తోంది. ట్రైలర్ లాంచ్‌కి ముందు ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకోనున్నారు. యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఒకేసారి చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. ఆగస్టు 26న 'టాక్సిక్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు నెట్టింట వైరల్ కాగా.. ట్రైలర్‌తో సినిమా అంచనాలు రెట్టింపు చేయాలని టీమ్ భావిస్తోంది. ఈ సినిమాలో బలమైన ఎమోషన్స్ ఉన్నాయని యశ్ అన్నారు. థియేటర్‌లో అందరూ ఆశ్చర్యపోతారన్నారు. యాక్షన్ సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని.. 'టాక్సిక్'లో హాలీవుడ్ స్టంట్ కోఆర్డినేటర్ జేజే పెర్రీ రూపొందించిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. ఇందులో ఈ రాకింగ్ స్టార్‌కు జోడీగా తారా సుతారియా, నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ,

# ఆదర్శ కుటుంబం నుంచి సంపూర్ణ పాత్ర పరిచయం




విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' నుంచి చిత్రబృందం మరో ఆసక్తికర గ్లింప్స్‌ను విడుదల చేసింది. రోజుకో కొత్త వీడియోతో సినిమా ప్రచారాన్ని వేగవంతం చేస్తున్న మేకర్స్, తాజాగా ఈ చిత్రంలో వెంకటేష్ కూతురిగా, చిట్టిబాబు గారాలపట్టిగా నటిస్తున్న సంపూర్ణ (యువినా పార్థవి) పాత్రను పరిచయం చేశారు. పరిచయమైన ప్రతి ఒక్కరితో ప్రేమలో పడే జెన్‌జీ కూతురి పాత్రలో సంపూర్ణ కనిపించబోతుంది. ఇక త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వినోదాత్మక ఘట్టాలతో నిండిన ఈ వీడియో సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో నారా రోహిత్, నివేతా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# చకచకా స్పిరిట్ షూటింగ్ పూర్తి

## వందరోజుల్లో పూర్తి చేసేలా ప్లాన్

టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం 'స్పిరిట్' గురించి ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిలింనగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్యాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ను కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేయాలని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్ట్‌ల షూటింగ్స్‌లో సమాంతరంగా పాల్గొంటున్నప్పటికీ, 'స్పిరిట్' టీమ్ మాత్రం తమ ప్లానింగ్ పక్కాగా ఉండటంతో సినిమా అనుకున్న సమయానికే పూర్తవుతుందని పూర్తి విశ్వాసంతో ఉంది. మరోవైపు ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి సుమారు 40 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. మిగిలిన మేజర్ షెడ్యూల్స్ ఎక్కువగా హైదరాబాద్‌లోనే జరగనున్నాయి. ఇదిలావుంటే సందీప్ టీమ్ ప్లానింగ్ వలన ప్రభాస్ చేస్తున్న అత్యంత తక్కువ బడ్జెట్ సినిమా ఇదేనని తెలుస్తుంది. గత దశాబ్ద కాలంలో ప్రభాస్ చేసిన భారీ బ్జడెట్ సినిమాలతో పోలిస్తే 'స్పిరిట్' అత్యంత తక్కువ బ్జడెట్‌తో రాబోతుందని ఇప్పటికే టాక్ కూడా బయటకు పాకింది. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మేకింగ్ స్టైల్‌తో ఈ చిత్రాన్ని మరింత పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తుండటంతో, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.




"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569